# అవే, నక్షత్రాలు!



బి. వి. సత్యనారాయణ

నేను పుట్టు గ్రుడ్డినైనా, అపురూపసౌందర్యవతి అయిన అరుణ నన్ను వరించిందంటే, నాలోని యేదో ఒక గొప్ప శక్తి ఆమెను ఆకర్షించి వుంటుందని అందరూ అనుకునేవారు. నేను నా దృష్టిని సంపాదించుకోలేకపోవడానికి నా ప్రయత్నలోపమేమీ కాదు. ఆ ప్రయత్నంలో యెన్నో సార్లు అపజయం కలగడంచేతనే, ఇక నాకీ జన్మలో ఆ భాగ్యం లేదనే నిశ్చయానికి యెప్పుడో వచ్చాను.

కొత్తగా అమెరికానుంచి వచ్చిన, సుప్రసిద్ధ నేత్రవైద్యుడు 'విలియమ్ లేక్'నుగురించి ప్రజలు విరగబడి చెప్పుకోవడం నేనుకూడ విన్నాను. నా అరుణ కోర్కెను మన్నించడానికే నేను ఆయనను కలుసుకోవడం జరిగింది. కాని నాకాయన దృష్టిని తెప్పించగలడన్న నమ్మకము నాకెప్పుడూ లేనేలేదు. ఈ విషయాన్ని విలియమ్‌కు కూడా ముందుగా చెప్పేను.

నన్ను పూర్తిగా పరీక్షించిన తరవాత, డాక్టర్ విలియమ్ నాతో యిలా అన్నాడు:

'శాబాస్! నీవు పూర్తిగా నిరుత్సాహపడడానికి కారణం నాకేమీ కనుపించడంలేదు... అయినప్పటికీ, నీవు అపజయానికిమాత్రం సంసిద్ధుడవై వుండాలి' అన్నాడు.

...నాకు నవ్వొచ్చింది...

'అయితే మీరిపుడనేదేమిటి? అని సూటిగా ప్రశ్నించాను.'

'నీ దృష్టి విషయంలో నాకు రెండే మార్గాలు కనిపిస్తున్నయ్. ఒకవిధంగా, నేను ఆపరేషను చేసినతరవాత, నీవు శాశ్వతంగా, స్వచ్ఛమైన దృష్టిని పొందవచ్చు—లేదా, మరొకవిధంగా, నీవు పొందిన దృష్టి మరల కొన్ని గంటలకే పోయి, క్రమంగా సర్వం అంధకారమై పోవచ్చు...ఆ పరిస్థితులలో, నీ ప్రాణానికే ముప్పు కలుగవచ్చు'......

అరుణ నిట్టూర్పును ఆ నిశ్శబ్దంలో, స్పష్టంగా అర్థంచేసుకున్నాను. నే నాపరేషను చేయించుకోడాని కామెకంత యిష్టంగా లేదనికూడ నే గ్రహించుకోగలిగాను.

కాని యేవిధంగా ఆలోచించినా, ఆపరేషను వల్ల నాకు కలగబోయే నష్టమేమిటో అర్థం కాలేదు......

......ఆపరేషన్ సవ్యంగా జరిగింది...రెండు రోజులతర్వాత ఒకనాడు విలియమ్ నా దగ్గరకు వచ్చి, 'నీ కళ్ళకు కట్టిన కట్లను, ఏ నిముషాలలో వచ్చి విప్పుతాను' అని చెప్పి వెళ్ళాడు. అప్పుడు నాలో అంతులేని మధురభావాలు, తీయని తలంపులూ మెరుపుల్లా మెరిశాయి. మరుక్షణంలోనే, అవ్యక్తమైన ఒక నిరాశాభావం నన్నావరించింది...కట్లు విప్పినతరవాత డాక్టరు నన్ను తెరచి చూడమన్నాడు. నేను కళ్ళువిప్పి చూడపోయేను...వస్తువులన్నీ మొదట ఆకారరహితంగా, తిమిరపూరితంగా కనిపించాయి.

మొట్టమొదట నా కళ్ళలో వెలుగు ప్రసరించినపుడు అవి కొద్దిగా బాధపడ్డాయి. క్రమంగా, కొన్ని నిముషాల్లోనే, నా దృష్టి సునిశితమై, వస్తువులన్నిటినీ విస్పష్టంగా చూసే శక్తి కలిగింది. అపుడు మొదటిసారిగా, నా సర్వజీవితాన్ని పర్యవలోకింపసాగాను...

హాస్పటలు గోడలు, మిరుమిట్లు గొలిపేటంత తెల్లగా వున్నయ్. హాస్పటలు గోడలు చాల తెల్లగా వుంచబడతాయని యిదివరలో విన్నాను. నా మంచానికి దగ్గరలో ఒక వ్యక్తిని చూచాను. మూర్తీభవించిన సౌందర్యదేవతలా నాకుతోచింది. ...ఆ వ్యక్తి, అరుణయొక్క గొంతుకతో మాట్లాడింది. ఆమెయే నా అరుణ యని అప్పుడనుకున్నాను.

ఆమె నా తలవైపు దగ్గరగా కూర్చుని 'ఇప్పుడు మీ కెలావుంది' అని అడిగింది ఆశాపూరితమైన నేత్రాలతో నావైపు చూస్తూ.

# ఆనందవాణి

పోస్టుబాక్సు నెం. 1583

12, తంబుచెట్టి వీధి, మదరాసు_1

★

[ప్రచురణ : ప్రతి ఆదివారం]

సాలుచందా .... రు. 14/-

అర్ధసంవత్సర చందా రు. 7-8-0

(తపాలా వ్యయంతో సహా)

★

★ అర్ధసంవత్సరముకంటె తక్కువ కాలానికి చందా అంగీకరింపబడదు.

★ 'ఆనందవాణి' చందాదారులకు దీపావళి సంచిక ఉచితం.

## చందాదారులు

మాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు వారి చందాదారు నంబరు తప్పక తెలుపవలెను. లేకుంటే జవాబు ఆలస్యమవుతుంది. మనియార్డర్లు "మేనేజరు, ఆనందవాణి ఆఫీసు, 12 తంబుశెట్టివీధి, జి.టి. మద్రాసు" అనివ్రాయవలెను. వ్యక్తుల పేర పంపవద్దు.

—మేనేజరు.


అది నాకే కాక, ఆమెకు కూడ, నవ్యజీవితంలోని తొలిఘట్టమే అని నేను గ్రహించక పోలేదు.

ఆమెకు నేను వెంటనే జవాబు యివ్వలేక పోయాను. నేను చూసిన వస్తువుల నొక్కొక్కదాన్ని గురించే తెలుసుకోవడంలో జాగుచెయ్యడం నాకిష్టంలేదు. ఒకవైపుకు వ్రేలితో చూపుతూ, 'అదే'మని అరుణ నడిగాను.

ఆ పచ్చని పెంపుడు వృక్షాలతోనూ, పూల చెట్లతోనూ వున్నదే మన వూరి పార్కు. ఆ మధ్యలో, సూర్యకిరణాల్లో ధగధగా మెరిసే, రజతవర్ణపు శిలావిగ్రహమే గాంధి మహాత్మునిది. ఆ ప్రదేశాన్నే 'స్వరాజ్యమైదాన'మని కూడా అంటారు' అని అంది అరుణ.

ఆనందరసానుభూతిచే నా హృదయం పొంగింది. విలియమ్సందలి కృతజ్ఞతాభావంచే నా హృదయం నిండింది.

'అదేనా మహాత్ముని విగ్రహము!' అని నేనాశ్చర్యంగా అడిగాను. నిష్కల్మషహృదయులైన యిరువురు పసిపిల్లల్లా, మేమిద్దరం నవ్వుకోవడం చూచి, విలియమ్ కూడా చిరునవ్వు నవ్వేడు...విలియమ్‌కు కృతజ్ఞత చెప్పాలనుకున్నాను. కాని సంతోషంచేత నా గొంతుక పూడుకు పోయింది.

డాక్టర్ విలియమ్, నా గదినుండి బయటకు వెడుతూ, నాతో యిలా అన్నాడు: 'హలో! నేను ముందుగా చెప్పిన రెండవవిషయాన్ని, మరచి పోవనుకుంటా...అటువంటి ప్రమాదానికి అవకాశం ఉండదనే, నే ననుకుంటున్నాను...అయినప్పటికీ మన జాగ్రత్తలో మనం వుండడం మంచిది కదూ!' అన్నాడు.

అరుణా, నేనూ ఒకరిముఖంవైపు ఒకరు చూచుకున్నాం.

... ... ...

"అరుణా! నిన్ను చూడడంలో నేను స్వర్గీయానందమును పొందుతున్నాను" అన్నాను. ఆమె ముంగురులను సవరిస్తూ...అక్కడ మంచినీటికై వుంచిన గాజుకూజా, టేబిలుపైనున్న, ఎర్రటి గులాబీలు మొదలైన చాలవిషయాలు ఆమెనుంచి తెలుసుకున్నాను.

అరుణ నా పరుపు శుభ్రం చేస్తూ, "మీరు బాగా అలసిపోయారు...కొద్దిగా నిద్రపొండి!



'వింధ్యరాణి'లో ఒక దృశ్యం

సాయంత్రం వచ్చి మీరు నిద్ర లేచాక, మళ్లీ మీ కళ్ళకి కొత్త విషయాలు చెప్తాను" అంది ఆమె వెళుతూ...

నేను నిజంగా చాలా అలసిపోయాను. సుందరతమమైన వస్తుచయాన్ని, తదేకదృష్టిచే చూడడం వల్ల, నా కనురెప్పలు బరువెక్కినై. నిద్రలేచాక, యింకా కొత్తవింతలను చూడవచ్చుననే ఆశతో నిద్రపోయాను.

... ... ...

నేను నిద్రనుండి లేవగానే, నా గదిలోని వస్తువులను, చూడడానికి ప్రయత్నం చేశాను. వాటి పేర్లన్నిటినీ జ్ఞాపకం తెచ్చుకుంటూ.

కాని అంతా యేదో భేదంగా వుంది...యేదో లోపం వుండితీరుతుంది. టేబిలుపై నున్న గులాబీలు, యిదివరకంతటి యర్రగా కాని, స్పష్టంగా కానీ లేవు. పార్కులోని పూలచెట్లుగానీ, శిలావిగ్రహంగాని, స్పష్టంగా కనిపించడంలేదు...నాకేమీ అర్థం కావడంలేదు...డాక్టరు చెప్పిన ఆఖరుమాటలు జ్ఞాపకం రావడంతోనే, యేదో భయం నన్నావరించివేసింది. ఆపరేషనువల్ల నాకు కలిగిన శక్తి, తాత్కాలికమైనదేనని గ్రహించుకున్నాను. నేను మళ్లీ శాశ్వతంగా గ్రుడ్డివాడినైపోతానని, తెలిసికొనేలోపుగానే, నా దృష్టి క్రమంగా పాడవుతుండడం గ్రహించాను. క్రమంగా కొద్దిసేపట్లోనే, గదిలోని వస్తువులన్నీ అంధకారంలో లీనమైపోయినై...చీకటిలో నా చేయి తగిలి గాజుకూజా బ్రద్దలైంది. పదునైన ఒక గాజుముక్క నా దగ్గరగా పడింది. గాజుముక్కను స్పృశించడంతోనే నా కో ఆలోచన తట్టింది... డాక్టరు చెప్పిన రెండవమార్గం కంటే, నేననుకునే మూడవమార్గమే, అన్నివిధాలా మంచిదని తోచింది...నా ప్రయత్నానికంతరాయంగా, తలుపు అప్రయత్నంగా తెరువబడింది.

"మీ రింకా లేవనే లేదా ?"...అరుణ గొంతుకే అది! ఆమె వస్తూనే, "కూజా బ్రద్దలైందా ?" అని అడిగింది.

"ఊఁ" అన్నాను హీనస్వరంతో.

ఆమె నా ప్రయత్నాన్ని గ్రహించిందేమో అని అనుకునే లోపుగానే, ఆమె మృదుహస్తాలు, నా చెక్కిళ్ళని తాకినై...ఆమె నా ప్రయత్నాన్ని గ్రహించింది కాబోలు. "ఇదంతా యేమని" అడిగింది నా రెండుభుజాల్నీ పట్టుకుని కొంచెం కోపంగానే.

ఆమెకేమి సమాధానం చెప్పాలో, నాకు తెలీలేదు.

## వ్యాసకర్తలకు:

★

- రచనాభ్యాసంగానికి మీరు కొత్తవారే కావచ్చు. ఐనా లోకానికి తెలుపవలసిన కొన్ని కొత్త విషయాలు మీలో ఊర కలువేస్తూ వుండి వుంటాయి. కాబట్టి ఎట్టి సంకోచమూ లేకుండా ఉత్సాహంతో ప్రయత్నించి మీ రచన మాకు పంపండి. ఏమాత్రం బాగున్నా సవరించి ప్రచురించడానికే సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తాము.
- హాస్యప్రధానమైన వ్యాసాలకు ఆనందవాణి ప్రాధాన్య మిస్తుంది.
- తప్పనిసరి ఐతేకాని రచనలలో ఇంగ్లీషు పదాలు వాడకూడదు.
- వినోదము కలిగించే విజ్ఞానదాయకమగు చిన్న చిన్న రచనలయితే వేగంగా ప్రకటింప వీలవుతుంది.
- కొత్త సమస్యలకు సంబంధించి, ప్రసాదమైన హాస్యశోభలో ఉంటే తప్ప పద్య వ్యాసములు పంపవద్దు.
- ప్రతి వ్యాసంతోనూ మూడు కాన్ల స్టాంపు బిళ్లలు పంపితేనే ప్రకటించే పక్షాన తెల్పడానికీ, నచ్చకపోతే వాపసు చేయటానికీ వీలవుతుంది. కార్డులు జతపర్చవద్దు.
- ప్రతివ్యాసంపయినా వ్యాసకర్త పూర్తి చిరునామా ఉండాలి.
- సరసమయిన హాస్యాలు కల్గి, వినోదింపజేసే వ్యంగ్యచిత్రాలనుకూడ ప్రచురణకు పంపవచ్చు.
- రచనలు, చిత్రాలు వ్యక్తుల పేర గాక— 'ఆనందవాణి' సంపాదకునకు 12 తంబు శెట్టి వీథి, పోస్టుబాక్సు నం. 1588 మదరాసు-' అని వ్రాయాలి. లేకుంటే వ్యాసపరిశీలనము ఆలస్యము కావచ్చు.

—సంపాదకుడు

"అయ్యో! నన్ను క్షమించు.. నేను జీవించి ప్రయోజనం లేదు" అని మాత్రం అనగలిగాను...

"జరిగిందేమో చెప్తారా? దయవుంచి" అందామె, ఆవేదనతో.

"నీవు వెళ్లిన తరవాత నిద్రలేచి గదిలోని వస్తువులను చూడసాగేను. అవి పూర్వంవలె స్పష్టంగా లేవని గ్రహించుకునేలోపుగానే, నా దృష్టి క్రమంగా, పూర్తిగా పాడవడం మొదలిడింది. ఇప్పుడు నాకే గదిలోని వస్తువేమీ చూడగల శక్తిలేదు. సర్వం అంధకారంలా వుంది. విలియమ్ చెప్పిన ఆఖరుమాటలే నిజమైనై" అన్నాను.

... ... ...

ఎంచేతనో ఆమె అట్టే నిరుత్సాహపడినట్టు నాకు తోచలేదు. ఆమె తన రెండుచేతులతోనూ, నన్ను చుట్టి నిలబెట్టింది.

"నీ కేమైనా మతిపోయిందా, అరుణా!" అన్నాను.

"మీ కిప్పుడే తెలుస్తుంది. ఎవరికి మతిపోయిందో!" అంది; అరుణ కొంచెం ఉత్సాహంగానే.

అరుణను నన్ను కిటికీదగ్గరకు తీసుకువెళ్ళనిచ్చాను.

"మీరిప్పుడు కళ్ళు తెరవండి" అందామె.

"అవి తెరవబడే వున్నాయి" అన్నాను.

నా మెడను తనచేత్తో, కొంచెం పైకెత్తి, "ఆ వైపు మీ కేమైనా వెలుగు కనిపిస్తూందా?" అని అడిగింది.

"ఆఁ! దూరంగా అక్కడక్కడ వెలుతురు కనిపిస్తూవుంది! అదంతా, నా భ్రమ కాబోలు!" అన్నాను.

"కాదండీ! అవే నక్షత్రాలు!" అందామె.

"నక్షత్రాలా!" వాటిని నే నెప్పుడూ చూడనే లేదు" అని నే నాశ్చర్యంగా అన్నాను.

"నిద్ర లేచింతర్వాత, మీ కే వస్తువూ, సరిగా కనిపించకపోవడానికీ, అంధకారంలా వుండటానికీ కారణం, మరేం కాదు......ఇప్పుడు చీకటిపడింది ...ఆ చీకటి మిమ్మల్ని ఒకర్నే కాదు, లోకంలోని ప్రతివ్యక్తినీ, గ్రుడ్డివానిగా చేస్తుంది!" అంది అరుణ.

ఇంతలోనే హాస్పటలులోని అన్ని లైట్లూ, ఒక్కసారిగా, గప్పున వెలగడంచేత నా కళ్లు మిరుమిట్లు గొల్పినై... .. ఆ విద్యుత్కాంతులలో అరుణ లేతచెక్కిళ్ళపై అరుణకాంతులను స్పష్టంగా చూడగలిగాను.